క్లుప్తంగా

వడ్డీలేని ఆటో ఇప్పిస్తాం



ఆటో గంగమ్మతో మాట్లాడుతున్న ఏపీఎం రాధిక

కొండాపురం : పగిడాల గంగమ్మ తన భర్త అనారోగ్యంతో ఉండటంతో అద్దెకు ఆటో తీసుకుని జీవనం సాగిస్తున్న ఆమెకు ప్రభుత్వం ద్వారా వడ్డీలేని ఆటో ఇప్పిస్తామని కడప డీఆర్‌డీఏ ఏపీఎం రాధిక తెలిపారు. గండ్లూరు ఎస్సీ కాలనీలో ఉంటున్న గంగమ్మను పీడీ, స్టేట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కలిసి మాట్లాడినట్లు ఆమె తెలిపారు. వడ్డీలేకుండా కోరుకున్న ఆటో ఇప్పిస్తామని ఆటో ఖరీదు ఎంత అయితే అసలుకు సంబంధించి నెల కంతు రూ.4వేల నుంచి రూ.5 వేల వరకు కట్టుకోమని గంగమ్మకు సూచించామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే ఆర్‌టీఏ అధికారితో మాట్లాడి ఎల్‌ఎల్‌ఆర్ ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆమె వివరాలను సేకరించినట్లు తెలిపారు. గంగమ్మ మాట్లాడుతూ నాకున్న ముగ్గురు పిల్లలను పోషించాలంటే కష్టంగా ఉందని ఎవరైన దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని ఆటో గంగమ్మ వేడుకొంది.

దుకాణాల తనిఖీ



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పులివెందుల టౌన్ : పట్టణంలోని గాంధీ సర్కిల్ రోడ్డు, కొత్త బస్టాండు రోడ్లకు ఇరువైపుల ఉన్న పలు దుకాణాలను గురువారం మున్సిపల్ ఇన్‌చార్జి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా దుకాణాలలో ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులపై రైడింగ్ నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల అమ్మకం చేసే అంగళ్ల లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడకుండా గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు, స్టీల్ క్యారియర్లు వాడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణయ్య

ఎర్రగుంట్ల : చిలంకూరు గ్రామంలో ఉన్న సచివాలయాన్ని ఎంపీడీఓ వెంకటరమణయ్య గురువారం అకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయంలోని సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. తర్వాత గృహ నిర్మాణ శాఖపై అధికారులతో చర్చించారు. సచివాలయ సిబ్బంది వేలిముద్రలపై హాజరు పట్టిని పరిశీలించారు. అభివృద్ధి పనులపై చర్చించారు.

క్రిస్మస్‌కు ముస్తాబైన టౌన్ చర్చి



విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న టౌన్ చర్చి

జమ్మలమడుగు : పట్టణంలోని టౌన్ చర్చిని అందంగా ముస్తాబు చేశారు. బ్రిటిషు కాలం నాటిదిగా గుర్తింపు ఉన్న ఈ చర్చిలో పట్టణంలోని టీసీసీ, సీఎస్ఐ తదితర సంఘాలు ప్రార్థనలు చేసుకుంటారు. చర్చిని శిలువ ఆకారంలో నాటి బ్రిటిషు వారు నిర్మించారు. క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

భూ సమస్యల పరిష్కారం

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని చిన్న మాచుపల్లెలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సరస్వతి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి అందుతున్న వినతులలో ఎక్కువ శాతం భూ సమస్యలకు సంబంధించిన వినతులే అందుతున్నాయన్నారు. వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. రెవెన్యూ సదస్సులలో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి యొక్క భూసమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. తమ దృష్టికి వచ్చిన భూ సమస్యలను 45 రోజులలోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆయా సమస్యలపై అభ్యంతరాలు ఉన్నట్లయితే ఇదే సదస్సులో వినతి పత్రాలు అందజేయాలన్నారు. అనంతరం రైతుల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పరిమళ, ఆర్ఐ కౌశిక్, సర్వేయర్ సోమశేఖర్, విలేజ్ సర్వేలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ..?

పులివెందుల నియోజకవర్గాన్ని సింగపూర్ తరహాలో అభివృద్ధి చేస్తాం.. పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.. అభివృద్ధి అంటే ఏమిటో చేతుల్లో చూపిస్తాం.. ఇదీ ఎన్నికల సమయంలో కూటమి నేతలు నియోజకవర్గ ప్రజలకు ఊదరగొట్టి గుప్పించిన హామీలు. కూటమి నేతల హామీల మాట అటు ఉంచితే నియోజకవర్గంలోని వేంపల్లెలో నూతన బస్టాండు నిర్మించి ప్రారంభించకపోవడంతో ప్రయాణికులకు బస్టాండ్‌లేక రోడ్లపైనే పడిగాపులు కాస్తున్నారు. బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు కష్టాలు అన్ని ఇన్నీ కావు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రయాణీకులకు నిలువ నీడ కల్పించిన పాపానపోవడం లేదని విమర్శలొస్తున్నాయి.

- ప్రారంభానికి నోచుకోని నూతన బస్టాండు
- బస్టాండ్ లేక ప్రయాణికులు పాట్లు
- బస్సుల కోసం రోడ్లపైనే పడిగాపులు

వేంపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కడప రోడ్డులో ఉన్న బస్టాండు శిథిలావస్థకు చేరుకోవడంతో రూ.2.20 కోట్లతో నూతన బస్టాండ్‌ను నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. నిర్మాణ పనులు 90 శాతం పూర్తి చేశారు. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగింది. నాలుగు నెలలు గడుస్తున్నా 10 శాతం నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో సాక్షి దినపత్రికలో 'బస్టాండు నిర్మించారు.. గాలికి వదిలేశారు' అనే కథనం రావడంతో అధికారులు స్పందించి 10 శాతం నిర్మాణ పనులు పూర్తి చేశారు. అయితే నూతనంగా నిర్మించిన బస్టాండును ఇప్పటికీ ప్రారంభించకపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నూతన బస్టాండు నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ముఖ్యంగా మల, మూత్ర విసర్జన కోసం మహిళలు, వృద్ధులు, మహిళా కండక్టర్లు నానా అవస్థలు పడుతున్నారు. వేంపల్లె మండలంలో 17 గ్రామపంచాయతీలలో 34 గ్రామాలు ఉన్నాయి. దాదాపు 65 వేల జనాభా ఉంది. చుట్టూ ఐదు మండలాలకు కేంద్ర బిందువుగా వేంపల్లె ఉంది. మండల ప్రజలు దూర ప్రాంతాలైన తిరుపతి, చెన్నై, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఇక్కడికి వచ్చి బస్సులను ఎక్కాల్సి వస్తోంది. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ట్రిపుల్ ఐటీలు ఉన్నాయి.

రోడ్లపైనే వాహనాలు పార్కింగ్..

ఇక్కడ అనునిత్యం కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, రాయచోటి డిపో బస్సులు తిరుగుతుంటాయి. నిత్యం వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. బస్టాండ్ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యతో బస్సులు నిలవకుండా వెళ్లిపోవడంతో ప్రయాణీకులు చాలా



బస్సుల కోసం రోడ్డుపైన వేచి ఉన్న ప్రయాణికులు



వేంపల్లెలో ప్రారంభానికి నోచుకోని నూతన ఆర్టీసీ బస్టాండు

ఇబ్బందులకు గురవుతున్నారు. అరగంటకుపైగా ప్రయాణికులు రోడ్లపైన నిలబడి ఉండటంతో ఎండాకాలంలో చెమటలు కక్కాల్సిందే. ప్రధానంగా వైద్యం కోసం కడప, తిరుపతికి ఇక్కడినుండే ఎక్కువగా బస్సులకు వెళ్తుంటారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో ఎండ వేడిమికి అవస్థలు పడుతున్నారు.

ట్రాఫిక్ సమస్య జఠిలం :

వేంపల్లెలో నాలుగు ప్రాంతాల నుంచి బస్సులు ఒకేసారి రావడం, ప్రధాన రహదారి పైనే వాటిని నిలిపివేస్తుండటంతో నాలుగు మార్గాల్లో నుంచి వచ్చే వాహనాలు వైదొలిగేందుకు ఎన్నోపాట్లు పడాల్సి వస్తోంది. ఇక వాహనాలను దు కాణాలకు ఎదురుగా నిలుపుతుండటంతో ఆటోల ను తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందని డ్రైవర్లు వాపోతున్నారు. ఎదురుగా పోలీస్ స్టేషన్ ఉన్నా పోలీసులు దీనిని పట్టించుకోవడం లేదు.

అధికారులు స్పందించాలి



నూతన బస్టాండు నిర్మించినా ప్రయోజనం లేదు. ప్రధాన రహదారులపైనే బస్సులను నిలిపి ఉంచడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పైగా ట్రాఫిక్ సమస్య పీడిస్తోంది. అంగళ్లు, పోలీస్ స్టేషన్ ఎదురుగా వాహనాలను నిలిపివేస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అద్దె బస్సులు నడిపే డ్రైవర్లు వాహనాలకు దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నూతన బస్టాండ్‌ను త్వరలో ప్రారంభిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– సుబ్బరాయుడు, ప్రయాణికుడు, వేంపల్లె

మల, మూత్ర విసర్జనకు అవస్థలు పడాల్సి వస్తోంది



ఎర్రగుంట్ల నుంచి రాయచోటికి వెళుతున్నాను. వేంపల్లెలో రాయచోటి బస్సు కోసం రెండు గంటల నుండి రోడ్డుపైనే పడిగాపులు కాస్తున్నాను. ప్రయాణికులు మల, మూత్ర విసర్జన చేసుకోవాలంటే చాలా ఇబ్బందులుగా ఉంది. నూతన బస్టాండు నిర్మించినా ప్రారంభించకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు, వృద్ధులు, మహిళా కండక్టర్లు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. త్వరగా బస్టాండ్‌ను ప్రారంభిస్తే బస్సు వచ్చేంతవరకు రోడ్లపైన పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండదు. ఇప్పటికైనా పాలకులు స్పందించాలి.

– లక్షుమమ్మ, ప్రయాణికురాలు, ఎర్రగుంట్ల

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె : పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీ, వైఎస్ రాజారెడ్డి నగర్ ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అలాగే రాజీవ్ నగర్ కాలనీ, ఎస్‌టీఆర్ సర్కిల్, ఫైర్ స్టేషన్, ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపం, ఐటీఐ సర్కిల్, ఆర్టీసీ బైపాస్ సర్కిల్ తదితర ప్రాంతాలలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీరు శివదినేష్‌కుమార్ తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. ఈ విషయాన్ని రైతులు, ప్రజలు గమనించి సహకరించాలన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా



ఆర్టీపీపీలో ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని విద్యుత్ ఉద్యోగులు సంయుక్తంగా గురువారం ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జగదీష్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, చండీఘడ్ రాష్ట్రాలలోని డిస్కంలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా చేసినట్లు తెలిపారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటికరణ చేయడం వల్ల విద్యుత్ సరఫరాపై చాలా సమస్య పడుతుందని ఇలాంటి ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని సూచించారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్స్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కొనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య

లింగాల : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. గురువారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఎగువ లింగాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి మూడుసార్లు ల్యాబ్‌కు అందజేయాలని, ఎవరికైనా మలేరియా వ్యాధి నిర్ధారణైతే వెంటనే చికిత్స అందించిన మలేరియా గ్రామంలో ఫీవర్, లార్వా సర్వేలు చేసి గ్రామస్తులందరికి రక్త పరీక్షలు చేయాలన్నారు. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పనికిరాని ప్లాస్టిక్ సామాన్లు, గాజు సీసాలను ఇంటి పరిసరాలకు దూరంగా ఉంచాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడే పాటించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి ల్యాబొరేటరీలో రికార్డులను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్ సురేష్‌ను మలేరియా, డెంగీ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివరాం, పీహెచ్‌ఎన్ కుసుమకుమారి, ఆరోగ్య కార్యకర్త ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న సిబ్బందిని అభినందిస్తున్న ఎస్ఎంఎస్ కంపెనీ ప్రతినిధి ఖలీల్ సొదాగర్

వేముల : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎస్ఎంఎస్ కంపెనీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఖలీల్ సొదాగర్, మైనింగ్ అడ్వజయిర్ డీకే చౌదరిలు తెలిపారు. గురువారం వేముల మండ లం మబ్బుచింతలపల్లె గ్రామ సమీపంలో ఉన్న ఎస్ఎంఎస్ క్వార్టర్స్‌లో యురేనియం ప్రాజెక్టు ఎస్ఎంఎస్ కంపెనీ వ్యవస్థాపకుడు శక్తికుమార్, ఎం స న్సొటీ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో రక్తదానం చేయడంవల్ల ఇతరుల ప్రాణాలు కాపాడినట్లవుతుందన్నారు. శిబిరంలో 120 మంది కార్మికులు, సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదాతలకు పండ్లు, జ్యూస్‌లు పంపిణీ చే శారు. డీజీఎం ఎ.వి.సురేష్‌బాబు, మేనేజర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ పవన్‌కుమార్‌రెడ్డి, హెచ్‌ఆర్ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీకేదిన్నె : రక్తదానం చేస్తున్న విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్)లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రక్తందానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బంది లేదని, మరొకరి ప్రాణం రక్షించినట్లేనని, రక్త దాత శరీరంలో కొలెస్ట్రాల్ కూడా తగ్గి, కొత్త కణాల ఉత్పత్తికి సహాయపడుతుందని, దాతకు తన రక్తం ఇతరులలో ప్రవహిస్తోందన్న ఎంతో అద్భుతమైన భావన ఉంటుందని తెలిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కలిపి 104 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ యశస్వినిరెడ్డి, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

21న జాబ్ మేళా

కమలాపురం : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ), సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ – ఎంటర్ ప్రైజస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్(సీడాప్) వారి ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన కమలాపురంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కమలాపురం వెలుగు–డీఆర్‌డీఏ అసిస్టెంట్ మేనేజర్, టీ.గంగాధర్, జాబ్ కో–ఆర్డినేటర్ సుబ్బలక్షుమ్మ ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్(కొప్పర్తి), నవభారత్ ఫెర్టిలైజర్స్(కడప) కంపెనీలలో ఉద్యోగాల కోసం శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమలాపురం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని వెలుగు కార్యాలయంలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివి 19 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు అభ్యర్థులు విద్యార్హత పత్రాలు(ఒరిజినల్, జిరాక్స్), రేషన్ కార్డు, ఆధార్ కార్డు, 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తమ వెంట తీసుకు రావాలన్నారు. అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పనుల పరిశీలన



పైపులైన్ లీకేజీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

పులివెందుల టౌన్ : పట్టణానికి నీటిని సరఫరా చేసే నక్కలపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద గురువారం జరుగుతున్న పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను మున్సిపల్ కమిషనర్ రాముడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా పైపులైన్ లీకేజీ పనులను పూర్తిచేసి పట్టణ ప్రజలకు నీటిని సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ చిదానందరెడ్డి ఉన్నారు.

వేంపల్లెలో రెవెన్యూ సదస్సు



రెవెన్యూ సదస్సులో తహసీల్దార్, తదితరులు

వేంపల్లె : పట్టణంలోని ఒకటవ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సును తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 1బి, అడంగళ్లతోపాటు వివిధ సమస్యలతో రైతులు హాజరై వినతులను అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనవరి 8 వరకు ఈ రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయన్నారు. అనంతరం ఆయన భూసమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఇప్పపెంటలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పపెంట గ్రామ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల నుంచి 13 అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. శుక్రవారం కొలుములపల్లె గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నారు.

బ్రాహ్మణపల్లెలో మొక్కుబడిగా..



మాట్లాడుతున్న తహసీల్దార్ నజీర్ అహ్మద్

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు మొక్కుబడిగా సాగింది. గతంలో ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా గ్రామంలోని రామాలయం వద్ద నిర్వహించేవారని, అయితే రెవెన్యూ సదస్సులో గ్రామ కట్టుబడి సొంత స్థలంలో నిర్వహించడంతో ప్రజలు, రైతులు ఈ సదస్సుకు హాజరు కాలేదు. దీంతో అధికారులు ఈ సదస్సును మొక్కుబడి నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా ప్రీమియం గడువు పెంపు

సింహాద్రిపురం : రబీలో సాగు చేసిన పంటలకు పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 31వ తేదీవరకు గడువు పొడిగించారని మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఏఓ కార్యాలయంలో ఆయన తెలుపుతూ రైతులు సాగు చేసిన పంటలకు ఇ–క్రాప్ నమోదు పత్రాలు తప్పనిసరిగా ప్రీమియం చెల్లించు పత్రానికి జత చేయాలన్నారు. రైతులు ఇది తప్పనిసరిగా పాటించాలన్నారు.

పంటల బీమా గడువు పెంపు

కమలాపురం : రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు బీమా చేసుకోవడానికి గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి తెలిపారు. కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని కమలాపురం, వల్లూరు, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మండలాల పరిధిలోని రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన రైతులు రబీలో సాగు చేసిన ఆయా పంటలకు ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పథకం కింద ఇన్సూరెన్స్ ప్రీమియంలో రైతు వాటా సకాలంలో చెల్లించాలని ఆయన తెలిపారు. బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న రైతులు నేరుగా బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌ను సంప్రదించి ప్రీమియం చెల్లించి సాగు చేసిన ఆయా పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోవాలని తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో శనగ పంట గ్రామ యూనిట్ కింద వేరుశనగ, జొన్న, ప్రొద్దుతిరుగుడు, నువ్వు, వరి, మినుము, మొక్క జొన్న పంటలకు మండల యూనిట్ కింద పరిగణించడం జరుగుతుందని తెలిపారు. ఉల్లి, పెసర పంటలను జిల్లా యూనిట్ కింద పరిగణించనున్నట్లు తెలిపారు. బ్యాంకులో రుణాలు పొందే రైతులు రుణం పొందు సమయంలో తప్పనిసరిగా పంటలకు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పంట రుణాలు తీసుకోని రైతులు మీ పరిధిలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పంట ధృవీకరణ పత్రాన్ని తీసుకుని బయట కామన్ సర్వీస్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మధ్య వర్తులను, దళారులను నమ్మవద్దని తెలిపారు. ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు రైతులకు పంటల బీమా భరోసాను కల్పిస్తుందన్నారు. రుణాలు తీసుకున్న వారు బ్యాంకు లో మాత్రమే చెల్లించాలన్నారు. ఏదో ఒక చోట మాత్రమే ప్రీమియం చెల్లించాలన్నారు. ఆయా పంటలకు హెక్టారుకు రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి. శనగకు రూ.1200, వేరు శనగకు రూ.1200, నువ్వులకు రూ.450, జొన్నలకు రూ.787.50, పెసరకు రూ.675, ప్రొద్దుతిరుగుడుకు రూ.750, మినుముకు రూ.712.50, వరికి రూ.1575 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు ఆయా గ్రామాల ఆర్‌ఎస్‌కే సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

వల్లూరు(చెన్నూరు) : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను గురువారం కొండపేట హైస్కూలులో సర్పంచ్ టి.చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సేవియా నాయక్ మాట్లాడుతూ మనమందరం భవిష్యత్తుకు భరోసా ఇవ్వడం అంటే అన్ని రకాల ఇంధనాలను పొదుపు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. విద్యుత్ పొదుపులో భాగంగా ప్రతి ఒక్కరూ గృహాలలో అనవసరంగా లైట్లు వేయడం, ఫ్యాన్లు తిరుగుతున్నప్పటికీ ఆఫ్ చేయకుండా ఉండటం, ఫ్రిడ్జ్‌లను పదేపదే తెరవడం, నాణ్యతలేని బల్బులు, నాణ్యతలేని మోటార్లను వాడటం చేయకూడదన్నారు. రైతాంగం తమ పొలానికి అవసరం లేనప్పుడు మోటార్లను ఆఫ్ చేసి ఉంచాలన్నారు. కొన్ని సందర్భాలలో రైతులు ఆటోమేటిక్ మోటార్లను వాడటం వలన అవసరం లేకపోయినా మోటర్లు పనిచేయడం, భూగర్భ జలం వృథా చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అతిథులు

బొగ్గు నిల్వలు తగ్గిపోయి విద్యుత్తు ఉత్పత్తి ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్తును ఉపయోగించడానికి ప్రయత్నాలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గౌరవ ప్రధాన ఉపాధ్యాయులు నిర్వహించిన విద్యుత్ పొదుపు భవిష్యత్తు భరోసా అనే అంశంపై ర్యాంకులు పొందిన విద్యార్థులందరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గౌరవ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.రామలింగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి

వీరపునాయునిపల్లె : డ్వాక్రా సంఘాల్లోని ప్రతి మహిళా ఆర్థికంగా బలోపేతం కావాలని వెలుగు ఏపీఎం భాగ్యమ్మ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సమస్యల సుస్థిరత, నియంత్రణ, యాజమాన్యం, ఆర్థికంగా ఎదగడం తదితర అంశాలపై మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య సభ్యులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పెండ్లిమర్రి ఏపీఎం బాలస్వామి మాట్లాడుతూ చిన్న సంఘాలు, గ్రామ సంఘాలు ఆర్థికాభివృద్ధి చెందడం సామాజికంగా ఎదగడం అనే అంశాలపై అవగాహన కల్పించారు. సోషియల్ సెక్యురిటీపై వేంపల్లె ఏపీఎం వెంకటేశ్వర్‌రావు అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం వలన మరింత ఎక్కువ రుణాలు పొందేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో సీసీలు, గ్రామ సమాఖ్య, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



సంఘాలు బలోపేతం అయ్యేందుకు తీసుకోవాల్సిన ప్రణాళికలను తయారు చేస్తున్న సభ్యులు

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

కమలాపురం : ప్రతి ఒక్కరూ ఖాళీ ప్రదేశాల్లో చెట్లను నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు నందించాలని ఆగ్రో ఫారెస్ట్ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు కేకే కిరణ్, కే అనూష తెలిపారు. మండలంలోని చదిపిరాళ్ల గ్రామంలో ఆగ్రో ఫారెస్ట్ వారి ఆధ్వర్యంలో గురువారం రైతులకు చెట్ల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో పాల్గొన్న సీసీలు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో చెట్లను పెంచడం వలన పర్యావరణాన్ని రక్షించడంతో పాటు పశువులను అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. దీని వలన రైతులు తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో ఆర్‌ఐడీఎస్ ఫెసిలిటేటర్ దేవరాజు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీసీలు